

మన్సూరాబాద్ డివిజన్ వీరన్నగుట్టలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ట్రంకులైను నిర్మాణానికి శాశ్వత పరిష్కారం: ఎమ్మెల్యే

హయత్‌నగర్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్‌లోని వీరన్నగుట్టకాలనీ, పరిసర కాలనీల్లో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీ దవాఖానా చుట్టు ఉన్న దాదాపు పది కాలనీలకు డ్రైనేజీ ఔట్‌లెట్ లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని కాలనీ ప్రజలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఔట్‌లెట్‌కు అడ్డంగా ప్రైవేటు వ్యక్తుల స్థలం ఉండడం వల్ల ట్రంకు లైను పనులు నిలిచిపోయాయని తెలిపారు. వెంటనే ఎమ్మెల్యే సంబంధిత స్థలం యజమాని రాజేందర్ తమ్ముడు జితేందర్‌ను పిలిచి ఔట్‌లెట్‌కు స్థలం ఇవ్వాలని కోరడంతో అందుకు ఆయన అంగీకరించారు. దీంతో కాలనీల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా ట్రంకు లైను పనులు పూర్తి అవుతాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దేశభక్తి, సమాజసేవలో భాగస్వాములు కావాలి

● రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఎస్‌కే మహమూద్

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): దేశభక్తితో పాటు సమాజ సేవలో విద్యార్థులు భాగస్వాములు కావాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఎస్‌కే మహమూద్ అన్నారు. నగరంలోని బేగంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-4 ఆధ్వర్యంలో పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టి అన్నారంలోని వార్డు కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాల్లో తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వారికి సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ రీసెర్చ్ అసోసియేట్ రవితేజ, కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కలుషిత నీటి సరఫరా సమస్యను పరిష్కరిస్తాం

కొత్తపేట : కాలనీల్లో నెలకొన్న కలుషిత నీటి సరఫరా సమస్యను పరిష్కరిస్తామని కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన కామినేని చౌరస్తా సమీపంలో గల రాజీవ్‌గాంధీనగర్‌లో పర్యటించారు. కొన్ని ఇళ్లకు కలుషిత తాగునీరు సరఫరా అవుతోందని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. కాలనీలో సరఫరా అయిన కలుషిత నీటిని పరిశీలించారు. సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని జలమండలి ఏఈ స్రవంతీరెడ్డిని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ సమస్య పరిష్కారమయ్యే వరకు ఆయా ఇళ్లకు జలమండలి వారు ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శ్మశానవాటిక అభివృద్ధి పనులు చేపడతాం

మన్సూరాబాద్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని ఆటోనగర్ శ్మశానవాటికలో మిగులు అభివృద్ధి పనులకు రూ.54.40లక్షల నిధులు మంజూరయ్యాయని, ఈ పనులను త్వరలోనే చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగా శ్మశానవాటికలో చేపట్టబోయే పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పరిసర కాలనీ సంక్షేమ సంఘం నాయకులు శ్మశానవాటిక అభివృద్ధి కమిటీని వేసుకుని వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కాటికాపరులు అడ్డగోలుగా నగదు తీసుకోరాదని, శ్మశానవాటికలో కేవలం దహన సంస్కారాలు మాత్రమే చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు అంజయ్యగౌడ్, చంద్రారెడ్డి, సయ్యద్ జానీ, దామోదర్ గౌడ్, రాఘవేందర్, దశరథ్, ప్రసాద్, అనిల్, బీజేపీ మన్సూరాబాద్ అధ్యక్షుడు మునగాల హరీష్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

ఓల్డ్‌మలక్‌పేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి) : మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా మూడు రోజులు సెలవులు వచ్చాయి. శనివారం అమావాస్య సందర్భంగా సెలవు ప్రతి అమావాస్యకు మార్కెట్‌లో ఎలాంటి కొనుగోళ్లు ఉండవు ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా సెలవు మరునాడు సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా సెలవు వరుసగా మూడు రోజులు సెలవులు వచ్చాయి. మంగళవారం మార్కెట్ యథావిధిగా కొనసాగుతుందని సంబంధిత అధికారులు తెలిపారు.

నేడు, రేపు ఆస్తిపన్ను చెల్లింపులకు ప్రత్యేక కౌంటర్

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను, ఎల్‌ఆర్ఎస్, ట్రేడ్ లైసెన్సు ఫీజు చెల్లింపులకు సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఆది, సోమవారం సెలవు రోజు అయినప్పటికీ ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యాలయంలో సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బకాయిదారులు పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

ఓటీఎస్ ద్వారా.. రూ.2కోట్ల ఆస్తిపన్ను వసూలు



ఓటీఎస్ ద్వారా వసూలు చేసిన రూ.18.35లక్షల చెక్కును అందుకుంటున్న ఏఎంసీ మురళీమోహన్, టాక్స్ ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌రావు, బిల్ కలెక్టర్

చాదర్‌ఘాట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఓటీఎస్ (వన్ టైమ్ సెటిల్‌మెంట్) ద్వారా జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 పరిధిలో రూ.2కోట్ల మేరకు ఆస్తి పన్ను వసూలు చేశారు. సర్కిల్-6 పరిధిలోని మూసారాంబాగ్, సైదాబాద్, ఆజంపుర, అక్బర్‌బాగ్, ఓల్డ్‌మలక్‌పేట, చావునీ డివిజన్లు ఉండగా వీటిలో కేవలం ఒక్క మూసారాంబాగ్‌లోనే రూ.50లక్షలకు పైగా ఆస్తి పన్ను ఓటీఎస్ ద్వారా వసూలు చేసినట్లు ఏఎంసీ సంజయ్‌సింగ్ తెలిపారు. ఆస్తిపన్నుపై విధించిన వడ్డీపై 90శాతం మేరకు రాయితీ విధించడంతో ఏళ్ల నాటి బకాయిపడిన ఆస్తుల నుంచి పన్నులను వసూలు చేసేందుకు ప్రధానంగా దృష్టి సారించారు. మలక్‌పేట సర్కిల్-6 నుంచి ఆస్తి పన్ను రూ.37కోట్ల మేరకు వసూలు కావాల్సి ఉండగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.32కోట్లు టార్గెట్ విధించగా ఇంతవరకు రూ.31.50కోట్లు వసూలైనట్లు డీసీ జయంత్ తెలిపారు. ఆస్తి పన్ను వసూలుకు మరో రెండు రోజులు గడువు ఉండడంతో రూ.కోటి నుంచి రూ.కోటిన్నర వరకు వసూలయ్యే అవకాశముందని వారు అంచనా వేస్తున్నారు.

డివిజన్ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు క్రియాశీలకం

సైదాబాద్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): డివిజన్ అభివృద్ధిలో కాలనీ సంక్షేమ సంఘాలు క్రియాశీలకంగా పనిచేస్తున్నాయని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తెలిపారు. శనివారం సరస్వతీనగర్ సంక్షేమ ఆధ్వర్యంలో కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఇటీవల నియమితులైన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు తోట అమర్నాథ్‌రెడ్డి సన్మానసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అమర్నాథ్‌రెడ్డితో పాటు మిద్దెతోట సృష్టికర్త, రాష్ట్రపతి అవార్డు గ్రహీత రవిచంద్రకుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి చెన్నారెడ్డి, సభ్యులు శ్రీనివాస్‌రావు, బుస్సా శ్రీనివాస్‌గుప్తా పాల్గొన్నారు.

రంజాన్ ఏర్పాట్లు పూర్తి

ఓల్డ్‌మలక్‌పేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి) : రంజాన్ సందర్భంగా మలక్‌పేట సర్కిల్ పరిధిలోని ఈద్గాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మలక్‌పేట సర్కిల్ 6 డిప్యూటీ కమిషనర్ జయంత్ తెలిపారు. ఈద్గాలు, మసీదులకు వెళ్లే మార్గంలో రోడ్ల మరమ్మతులు ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టామని ఈద్గాలకు రంగులు లైటింగ్, శానిటేషన్, మొదలైన ఏర్పాట్లు చేశామన్నారు. అదేవిధంగా హెల్త్‌డిపార్ట్‌మెంట్ వారు ఈద్గాల వద్ద ఫస్ట్‌ఎయిడ్ సెంటర్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. ఈద్గాల వద్ద ప్రశాంతంగా ప్రార్థనలు చేసుకునే విధంగా ఏర్పాట్లన్నీ పూర్తిచేశారు.

తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం

● పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పొలిట్ బ్యూరో సభ్యుడు నర్సింహులు

చంపాపేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం తీసుకరానున్నామని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు చెప్పారు. హస్తినాపురం డివిజన్‌లోని రోషన్‌దౌలా బస్తీలో శనివారం ఎల్బీనగర్ టీడీపీ హడ్‌హక్ కమిటీ మెంబర్ వై.వెంకట్‌గాంధీ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ



రోషన్‌దౌలాబస్తీలో నిర్వహించిన టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు తదితరులు

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు హాజరై ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బక్కని నర్సింహులు మాట్లాడుతూ తెలంగాణలో టీడీపీకి లీడర్, క్యాడర్ ఉన్నారన్నారు. వెంకటగాంధీ మాట్లాడుతూ టీడీపీకి ఎల్బీనగర్ నియోజకవర్గంలో బలమైన నాయకులు, కార్యకర్తలు ఉన్నారని, రాబోయే రోజుల్లో ఎల్బీనగర్‌లో టీడీపీ జెండా ఎగరనున్నదని అన్నారు. టీడీపీ మల్కాజిగిరి పార్లమెంట్ కన్వీనర్ కందికంటి అశోక్‌కుమార్, నాయకులు పెంటయ్య, సురేష్‌నాయుడు, ప్రసాద్‌బాబాయ్, సురేష్ పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల పార్టీ టీడీపీ : వెంకట్‌గాంధీ

వనస్థలిపురం : బడుగు, బలహీన వర్గాలను కేవలం ఓటు బ్యాంకు కోసమే వాడుకుంటున్న తరుణంలో వారికి రాజకీయ అవకాశాలను కూడా కల్పించాలన్న సంకల్పంతో ఏర్పడిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని ఎల్బీనగర్ టీడీపీ హడ్‌హక్ కమిటీ సభ్యుడు వై.వెంకట్‌గాంధీ పేర్కొన్నారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద వనస్థలిపురం కంటెస్టెడ్ కార్పొరేటర్ వెలగ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శనివారం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు



వనస్థలిపురంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న వై.వెంకట్‌గాంధీ, వెలగ చంద్రశేఖర్ తదితరులు

వేసి టీడీపీ జెండాను ఆవిష్కరించారు. వై.వెంకట్‌గాంధీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్‌నాయుడు, ప్రసాద్ బాబాయ్, సురేష్, కృష్ణవేణిరెడ్డి, మురళీధర్‌రెడ్డి, మరాటి భిక్షపతి, మల్లేష్‌యాదవ్, ఫణి, ప్రవీణ్, మహేష్, కరణ్‌చౌదరి పాల్గొన్నారు.

హయత్‌నగర్ : టీడీపీ ఆవిర్భావ దినోత్సవాలను హయత్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి టీడీపీ పార్లమెంటు కమిటీ సభ్యుడు సింగిరెడ్డి మురళీధర్‌రెడ్డి టీడీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు మరాటి భిక్షపతి, మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు దుర్గం మల్లేష్‌యాదవ్, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, ప్రవీణ్, మహేందర్, కరణ్‌చౌదరి, సుధాకర్‌గౌడ్, రమేష్‌గౌడ్, శివానాయక్, రాజునాయక్ పాల్గొన్నారు.

మునిసిపాలిటీల్లో ఇంటిపన్ను సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తా

● చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

సరూర్‌నగర్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్‌తో పాటు ఇతర మునిసిపాలిటీల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న ఇంటిపన్ను సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మీర్‌పేట్‌లో పన్నుల భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ అధ్యక్షులు భిక్షపతిచారి, ముఖేశ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన రిలే నిరాహార దీక్షలు శనివారంతో ముగిశాయి. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములుయాదవ్, కొలన్ శంకర్‌రెడ్డి తదితరులు హాజరై దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కొండా మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారిన పన్నుల పెంపును వెంటనే రద్దు చేసి, ప్రజాభిప్రాయానికి అనుగుణంగా పన్నులు మదింపు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పాలన పడకేసిందని, కేంద్రం విడుదల చేసే నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగుతున్నాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మీర్‌పేట్ దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

పన్నులు తగ్గించాలని సీడీఎంఏకు బీఆర్ఎస్ వినతి

మీర్‌పేట్ కార్పొరేషన్‌లో పన్నులు తగ్గించాలని కోరుతూ బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సీడీఎంఏకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు అనిల్ యాదవ్, రాజేందర్‌రెడ్డి, బీరప్ప, పద్మాఅంజయ్య, సురేఖారమేష్, రాజ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు రజాక్, శ్రీనునాయక్, సునీత, విజయలక్ష్మి, శిశుపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బాల్‌రాజ్, హామూనాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి : సబితారెడ్డి

సరూర్‌నగర్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులు మంచి మార్కులు సాధించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి సూచించారు. శనివారం బడంగ్‌పేట్‌లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన వార్షికోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని, తమ భవిష్యత్‌ను తీర్చుదిద్దుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి మాట్లాడుతూ బడంగ్‌పేట్‌లో డిగ్రీ కాలేజీ ఏర్పాటు కోసం తాను ఎంతో కష్టపడ్డానని, ఎట్టకేలకు ప్రభుత్వం కళాశాలను మంజూరు చేసిందని అన్నారు. అనంతరం పలువురు ఉత్తమ విద్యార్థులకు మెమెంటోలు, అవార్డులు అందజేశారు. మూడేళ్ల డిగ్రీ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఆయా కార్యక్రమాల్లో కళాశాల సభ్యుడు పెద్దబావి అనంద్‌రెడ్డి, భాగ్యనగర్ రైతు సహకార సంఘం చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అధ్యాపకులు డాక్టర్ రేవతి, నర్సింహరాజు, డాక్టర్ వెంకటిరెడ్డి, డాక్టర్ రామరాజు, డాక్టర్ జ్యోతి, కె.నర్సింహ, డాక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు.



కళాశాల సావనీర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ప్రజలకు అందుబాటులో ఉండని బడంగ్‌పేట్ కమిషనర్

● కుర్చీ ఎప్పుడూ ఖాళీనే.. బీజేపీ నేతల ఆరోపణ

● హాజరు వివరాలు కోరుతూ ఆర్టీఐ కింద దరఖాస్తు

సరూర్‌నగర్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ఓ బాధ్యత గల అధికారి ఎప్పుడూ బడంగ్‌పేట్ మునిసిపల్ కార్యాలయంలో కనిపించడం లేదని, ఈ దృష్ట్యా తమకు సదరు అధికారి హాజరు వివరాలు అందజేయాలని బీజేపీ నేతలు మునిసిపల్ సిబ్బందిని కోరారు. ఈ మేరకు శనివారం తమ పార్టీ నేతలతో కలిసి బీజేపీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి మునిసిపల్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి కమిషనర్ ప్రజలకు కనిపించేది చాలా తక్కువ అని, ప్రజల సమస్యలు తెలుసుకోవాల్సిన కమిషనర్ సక్రమంగా కార్యాలయానికి రావడమే మానేశారని ఆరోపించారు. అసలు కమిషనర్ నెలలో ఎన్ని రోజులు కార్యాలయానికి వస్తున్నారు.. ప్రజలకు ఏ సమయంలో అందుబాటులో ఉంటున్నారు వంటి వివరాలు ఆర్టీఐ చట్టం ప్రకారం తమకు అందజేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సైదులు, మధుసూదనాచారి, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మునిసిపల్ కార్యాలయంలో దరఖాస్తు అందజేస్తున్న నేతలు

తిరుపతికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం

● తిరుపతి- నాయుడుపేట హైవేపై అదుపుతప్పిన కారు

● అక్కడికక్కడే ఒకరు దుర్మరణం, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



శ్రీనివాస్‌రెడ్డి(ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): నలుగురు స్నేహితులు కలిసి తిరుపతికి వెళ్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందగా.. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన శ్రీకాళహస్తి సమీపంలోని తిరుపతి-నాయుడుపేట హైవేపై శనివారం ఉదయం జరిగింది. ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బండరావిరాలకు చెందిన కవాడి శ్రీనివాస్‌రెడ్డి(51) మాజీ ఉప సర్పంచ్. అదే గ్రామానికి చెందిన సామల బాల్‌రెడ్డి, చింతల మల్లారెడ్డి, తారామతిపేట గ్రామానికి చెందిన భరత్ స్నేహితులు. కాగా వీరు మల్లారెడ్డికి చెందిన బ్రిజ్జా కారులో శుక్రవారం సాయంత్రం తిరుపతికి బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు శనివారం తెల్లవారు జామున శ్రీకాళహస్తి సమీపంలోని తిరుపతి-నాయుడుపేట హైవేపై వెళ్తుంది. అదే సమయంలో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి నాలుగు పల్టీలు కొట్టింది. ప్రమాద దాటికి కారు ముందుభాగం నుజ్జునుజ్జు కాగా డ్రైవింగ్ సీట్లో ఉన్న శ్రీనివాస్‌రెడ్డి అందులో ఇరుక్కుని అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. మిగతా ముగ్గురికి కాళ్లు, చేతులు విరిగి తీవ్రంగా గాయపడినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న అక్కడి స్థానిక పోలీసులు గాయాలకు గురైన వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. క్రేన్ సహాయంతో కారులో ఇరుక్కున్న శ్రీనివాస్‌రెడ్డిని బయటకు తీశారు. ఈ ప్రమాదానికి నిద్రమత్తే కారణంగా పోలీసులు భావిస్తున్నట్లు తెలిసింది.

విషాదంలో కుటుంబ సభ్యులు

రోడ్డు ప్రమాదంలో మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి మృతి చెందడంతో ఆ కుటుంబంతో పాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడు శ్రీనివాస్‌రెడ్డికి భార్యతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. అతడు అందరితో కలుపుగోలుగా ఉండేవారని రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం బాధాకరం అని గ్రామస్థులు విచారం వ్యక్తం చేశారు.

సీపీఐ బడుగు బలహీన వర్గాల పార్టీ

● పార్టీ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా



అజీజ్‌పాషా సమక్షంలో సీపీఐలో చేరుతున్న తొర్రూర్‌కు చెందిన పలువురు యువకులు

హయత్‌నగర్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఓట్ల కోసం కాకుండా బడుగు బలహీనవర్గాల ప్రజల కోసం పోరాటం చేస్తుందని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా అన్నారు. శనివారం సాయంత్రం తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని తొర్రూర్ గ్రామంలో పలువురు సీపీఐలో అజీజ్‌పాషా సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ వంద సంవత్సరాల క్రితం పుట్టి పేదల పక్షాన పోరాటం చేస్తుందని అన్నారు. హయత్‌నగర్, సరూర్‌నగర్ మండలాల్లో అనేక మంది పేదలకు ఇంటి స్థలాలు ఇప్పించిన ఘనత సీపీఐకి దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 20 మంది సీపీఐలో చేరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ముత్యాల యాదిరెడ్డి, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి, రాచమర్ల బాలకృష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు సమ్మెకు సిద్ధం కావాలి

చాదర్‌ఘాట్ : దీర్ఘకాలిక డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికు లు సమ్మె చేసేందుకు సిద్ధం కావాలని ఎన్ఎంయూ రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రెటరీ సత్యం పిలుపునిచ్చారు. శనివారం దిల్‌సుఖ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఆర్టీసీ పూర్తిగా అప్పుల పాలైందన్నారు. అప్పట్లో కార్మికుల సంక్షేమం కోసం పట్టించుకోని కారణంగానే సంస్థ పూర్తిగా నిర్వీర్యమయ్యే స్థితికి చేరిందన్నారు. చివరకు ఎన్నికల ముందు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు చెల్లిస్తానంటూ చేసిన ప్రకటనను అమలు చేయని కారణంగానే గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పని చేసి కాంగ్రెస్ పార్టీకి మద్దతు నిచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆర్టీసీ కార్మికుల మద్దతుతో తిరిగి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా కేసీఆర్ ప్రభుత్వ తరహాలోనే కార్మికులను పట్టించుకోకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ఏప్రిల్ 3, 4వ తేదీల్లో జేఏసీ నాయకులు మరోమారు సమావేశమై సమ్మెకు ఎప్పటి నుంచి వెళ్తారనే విషయాన్ని ప్రకటిస్తారని వెల్లడించారు.

నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

మన్సూరాబాద్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): వేసవి కాలం ఎండల తీవ్రత దృష్ట్యా నీరు వృథా కాకుండా పొదుపుగా వాడుకోవాలని, నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ పేర్కొన్నారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగోల్ డివిజన్ శ్రీనివాసనగర్(విశాలాంధ్ర కాలనీ) సంక్షేమ సంఘం భవనంలో శనివారం కాలనీ అసోసియేషన్, సీడ్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తాధ్వర్యంలో 'సేవ్ వాటర్-సేవ్ లైఫ్' ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ యాదయ్య, కార్పొరేటర్ అరుణ, ఇంకుడుగుంతల ప్రత్యేకాధికారి జాల సత్యనారాయణలు మాట్లాడుతూ వర్షాకాలపు వరద నీరు వృథాగా పోకుండా ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, తద్వారానే నీటిని సంరక్షించిన వారమవుతామన్నారు. అనంతరం నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేసి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రచురించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్, సీడ్ స్వచ్ఛంద సంస్థ సీఈఓ ఎస్.నాగబ్రహ్మాచారి, మేనేజర్ రాజు, కాలనీ అధ్యక్షుడు థామస్, ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, సాయిలు పాల్గొన్నారు.

చంపాపేట : జల సంరక్షణ కోసం సమష్టిగా కృషి చేయాలని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సుజాతానాయక్ అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని వారోత్సవాలలో భాగంగా హస్తినాపురం డివిజన్‌లోని ఆర్‌కెఆర్ ఎన్‌క్లేవ్‌లో శనివారం జలమండలి, సేవ్‌ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాలనీ ప్రజలకు జల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ హాజరై వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వృథాగా పోయే వర్షపు నీటిని ఇంకుడు గుంతలలోకి మళ్లించాలని కోరారు. ప్రతి ఇంటి పెరట్లో, ప్రతి కాలనీ రోడ్ల పక్కన, పార్కులలో ఇంకుడు గుంతలను విరివిగా చేపట్టాలని కోరారు. అనంతరం ఇంకుడు గుంత తయారి విధానంపై కాలనీ ప్రతినిధులకు అవగాహన కల్పించారు. జలమండలి మేనేజర్ సత్యనారాయణ, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ టి.సురేందర్, కాలనీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణ, టీవో నర్సింగ్‌రావు పాల్గొన్నారు.



నీటి సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న డీసీ యాదయ్య, కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్

వచ్చే ఎన్నికల్లో గ్రేటర్‌లో బీజేపీదే పైచేయి

● పార్టీ రాష్ట్ర నేత శ్రీరాములుయాదవ్

సరూర్‌నగర్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో బీజేపీ ఆధిక్యత నిలుపుకోనున్నదని, రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల హైదరాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా నియమితులైన జి.నిరంజన్‌యాదవ్ శుక్రవారం రాత్రి శ్రీరాములుయాదవ్‌ను నాదర్‌గుల్‌లోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీరాములుయాదవ్‌ను ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు తర్రె మల్లేశ్‌యాదవ్, పార్టీ బడంగ్‌పేట్ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



నిరంజన్‌యాదవ్‌ను సన్మానిస్తున్న అందెల